సాక్షి
అనంతపురం

శుక్రవారం, 19, మే, 2023



నీటి సంపులో పడి రైతు మృతి

కళ్యాణదుర్గం మండలం చాపిరి రైతు మల్లికార్జున ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి మృతి చెందాడు. IIలో



అంతర్‌జిల్లా బైక్‌దొంగల అరెస్ట్

ఇద్దరు అంతర్‌జిల్లా బైక్ దొంగలను అనంతపురం త్రీటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. IIలో

గరిష్ఠం/కనిష్ఠం
43.9°/24.3°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత పెరిగింది.

న్యూస్‌రీల్

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.41.69 లక్షలు



హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ. 41.69 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. 51 రోజులకు గాను రూ.41,69,670 నగదు, అన్నదాన హుండీ ద్వారా రూ.35,232 నగదును భక్తులు స్వామివారికి సమర్పించారు. అదేవిధంగా 0.050 గ్రాముల బంగారు, 1.3 కిలోల వెండిని కానుకల రూపంలో సమర్పించినట్లు ఈఓ తెలిపారు. ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు, తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

టన్ను చీనీ రూ.40 వేలు



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.40 వేలు ప్రకారం అమ్మకాలు జరిగాయి. మార్కెట్‌కు 593 టన్నులు అమ్మకానికి రాగా, వాటిని ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. అందులో టన్ను గరిష్టం రూ.40 వేలు, కనిష్టం రూ.12 వేలు, సరాసరిన రూ.23,500 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ



ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్ : వైఎస్సార్ జిల్లా ఏటూరు వద్ద నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో తాడిపత్రి కృష్ణాపురం నాల్గోరోడ్డుకు చెందిన వెంకటలక్ష్మమ్మ, ఆమె కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, చేనేత కాలనీకి చెందిన డ్రైవర్ భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా మైలవరానికి చెందిన మర్తాల సుమలతకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా గురువారం చుక్కలూరులో అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజా, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటుసారా నియంత్రణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లాలోని సెబ్, ఎక్సైజ్ విభాగాల అధికారులతో నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో గురువారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారా, గేమింగ్ కేసులపై ఆరా తీశారు. కేసుల ఛేదింపు పెరగాలన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా సరిహద్దు స్టేషన్లలో గట్టి నిఘా పెట్టాలన్నారు. నాటుసారా ప్రభావిత ప్రాంతాలలో కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లి నాటుసారా ఇతర రాష్ట్రాల కట్టడికి కృషి చేయాలన్నారు. నమోదైన కేసుల్లో నిందితులను తప్పకుండా అరెస్టు చేయాలన్నారు. పోలీసు, సెబ్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమరేశ్వరన్ పాల్గొన్నారు.

చెనిక్కాయకే మొగ్గు

జిల్లా సంప్రదాయ–ప్రధాన పంట వేరుశనగ (చెనక్కాయ) సాగు విస్తీర్ణం ఈ ఖరీఫ్‌లో మరింతగా పెరగనుంది. మొత్తం పంటల సాగు అంచనాలో 50 శాతానికి పైగా వేరుశనగే ఉంది. గత ఏడాది 1.75 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు చేయగా.. ఈ ఖరీఫ్‌లో 2.31 లక్షల హెక్టార్లలో సాగులోకి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. వర్షాలు విరివిగా కురుస్తుండటం, భూగర్భజలాలు సమృద్ధిగా ఉండటం.. ప్రభుత్వం సకాలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయటం వెరసి పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



ప్రధాన పంట వేరుశనగ, అంతరపంట కంది

- ఖరీఫ్ సాగు అంచనా 4,40,877 హెక్టార్లు
- 2,31,150 హెక్టార్లలో ప్రధాన పంట వేరుశనగ
- జూన్ నుంచి మొదలు కానున్న 'ముంగారు' వ్యవసాయం
- విత్తన పంపిణీ, ఎరువుల సరఫరాపై యంత్రాంగం దృష్టి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2023 సాగు అంచనా ఖరారైంది. గత ఐదేళ్ల పంటల సాగు గణాంకాల ఆధారంగా ప్రణాళికశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ అంచనాలు రూపొందించారు. జిల్లాలో పంటల సాగు 4,40,877 హెక్టార్లు (11,02,192 ఎకరాలు)గా గుర్తించారు. అందులో నీటి వసతి కింద 1,01,158 హెక్టార్లు (2,52,895 ఎకరాలు) కాగా.. వర్షాధారంగా 3,39,719 హెక్టార్లు (8,49,297 ఎకరాలు)గా అంచనా వేశారు. ప్రధాన పంట వేరుశనగ 2,31,150 హెక్టార్లుగా లెక్క వేశారు. తర్వాతి ప్రధాన పంటలుగా పత్తి 51,162 హెక్టార్లు, కంది 30,225 హెక్టార్లు, ఆముదం 12,463 హెక్టార్లు, మొక్కజొన్న 8,431 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేశారు. ఆ తర్వాత జొన్న 7,041 హెక్టార్లు, ఉలవ 4,529 హెక్టార్లు, ఇక నీటి వసతి కింద ప్రధానపంటగా వరి 17,440 హెక్టార్లు కాగా.. మిగతావి పండ్లతోటలు, కూరగాయల పంటలు, మిరప, ఉల్లి, చెరకు తదితర పంటలు సాగులోకి రానున్నట్లు పేర్కొన్నారు. కాగా గతేడాది 2022 ఖరీఫ్‌లో 4.04 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి.

జూన్ నుంచి 'ముంగారు'

జూన్ నుంచి ముంగారు వ్యవసాయం మొదలు కానుంది. కాగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడటంతో రైతులు సేద్యపు పనుల్లో నిమగ్నమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 30 శాతం రాయితీతో కందులు, ఉలవలు, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. విత్తన సేకరణ, పంపిణీ ప్రక్రియను వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ముమ్మరం చేసింది. ఈ నెలాఖరు నుంచి రైతులకు విత్తన పంపిణీపై దృష్టి సారించింది. కాగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా పరిగణిస్తారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో కీలకమైన 'నైరుతి' రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61, జూలైలో 63.9, ఆగస్టులో 83.8, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. వేరుశనగతో పాటు ప్రధాన పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు సరైన సమయమని ఏఆర్ఎస్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ సాధినేని మల్లీశ్వరి ప్రకటించారు. అనుకున్న ప్రకారం నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపిస్తే... జిల్లాలో సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు.

ఖరీఫ్‌లో పంటల వారీగా సాధారణ సాగు విస్తీర్ణం అంచనా..

పంట	హెక్టార్లలో	పంట	హెక్టార్లలో
వేరుశనగ	2,31,150	ఉలవ	4,529
వరి	17,440	పెసర	1,598
కంది	30,225	అలసంద	298
పత్తి	51,612	మినుము	166
ఆముదం	12,463	సోయాబీన్	492
మొక్క జొన్న	8,431	పొద్దు తిరుగుడు	1,978
జొన్న	7,041	మిరప	10,360
సజ్జ	1,355	ఉల్లి	1,107
రాగి	83	చెరకు	88
కొర్ర	1,654	టమాట	9,148

(వీటితో పాటు కుసుమ, పసుపు, పొగాకు, నువ్వులు, సామలు, ఊదలు, పండ్లతోటలు, ఔషధ పంటలు... తదితర పంటలు కొంత విస్తీర్ణంలో సాగులోకి వస్తాయని అంచనా వేశారు)

ఎండలు.. తగ్గేదేలే!



నిర్మానుష్యంగా అనంతపురం క్లాక్‌టవర్ ప్రాంతం

అనంతపురం అగ్రికల్చర్: ఎండలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు పైపైకి దూసుకుపోతున్నాయి. భానుడు ప్రచండుడైపోతున్నాడు. నిప్పులు కురిపిస్తున్నాడు. జిల్లాలో తీవ్రమైన వడగాడ్పులకు జనం ఇబ్బందిపడుతున్నారు. గురువారం పుట్లూరులో రికార్డుస్థాయిలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. యల్లనూరు 43.2, శింగనమల, గుత్తి 42.9, తాడిపత్రి 42.5, యాడికి 42.4, నార్పల 42.2, గార్లదిన్నె 42.1 డిగ్రీలు ఉండగా.. మిగతా మండలాల్లో 40 నుంచి 42 డిగ్రీలతో సూరీడు మండిపోతున్నాడు.

- అటు శ్రీసత్యసాయి జిల్లాలో కూడా ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చెన్నేకొత్తపల్లిలో 42.3 డిగ్రీలు, కనగానపల్లి 42.2, ముదిగుబ్బ 41.9, తాడిమర్రి 41.8, రామగిరి 41.6 డిగ్రీలు ఉండగా.. మిగతా మండలాల్లో 38 నుంచి 41 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. అటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా 22 నుంచి 28 డిగ్రీల మధ్య చెమటలు పట్టిస్తున్నాయి. 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. మరో నాలుగైదు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఉత్తమ వలంటీర్లకు నేడు పురస్కారాలు

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు అనంతపురంలోని కృష్ణ కళామందిరంలో శుక్రవారం పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లలో సేవా వజ్ర అవార్డు కింద రూ.30 వేల నగదు, సేవారత్న అవార్డుకు రూ.20 వేలు, సేవామిత్ర అవార్డుకు రూ.10 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కార్యక్రమానికి మంత్రి ఉషశ్రీచరణ్‌తో పాటు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు.

కన్నం కేసు కంచికేనా!

- టౌన్‌బ్యాంకు లాకర్ చోరీపై పట్టించుకోని పాలకవర్గం
- వజ్రాల నెక్లెస్, బంగారు ఆభరణాలు హుష్‌కాకి
- నేర స్థలిలో ఆధారాలు లేకుండా చేసిన దుండగులు
- కేసు మూసేసి చేతులు దులుపుకున్న పోలీసులు

బ్యాంకు లోపల, బయట 16 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ కెమెరాల కళ్లుగప్పి లోనికెళ్లి చోరీ చేయడం, ఆనవాళ్లు లేకుండా జాగ్రత్తపడడం 'ఇంటి దొంగల' పనేనా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. నగర నడిబొడ్డున జరిగిన ఈ ఘటనకు సంబంధించి నిందితులను గుర్తించలేకపోవడం, లాకర్ల వివరాలు పూర్తిగా వెల్లడించకపోవడం పోలీసుల దర్యాప్తు తీరును వేలెత్తి చూపిస్తోంది.

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ది అనంతపురం కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో జరిగిన భారీ చోరీ కేసు దర్యాప్తు అటకెక్కింది. బ్యాంకుకు కన్నమేసి రూ.56 లక్షలు విలువ చేసే వజ్రాలహారంతో పాటు కిలోకుపైగా బంగారు నగలను అపహరించుకుపోతే పోలీసులు దొంగల ఆచూకీని కూడా కనుక్కోలేకపోవడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి బ్యాంకు పాలక వర్గానికి చాలా చేరువగా ఉన్న పోలీసులు ఈ కేసులో పురోగతికి అవకాశం లేకుండా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతకీ ఈ చోరీ చేసింది... దొంగలా.. దొరలా? అన్నది మిస్టరీగానే ఉండిపోయింది.



నేర స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆ రోజు ఏం జరిగింది?

2019 ఆగస్టు 30వ తేదీ టౌన్ బ్యాంకులో దొంగలు పడ్డారన్న విషయం తెలుసుకున్న పోలీసులు, పాలక వర్గం సభ్యులు స్ట్రాంగ్ రూంలోకి వెళ్లి పరిశీలించారు. దొంగలు చోరీకి బ్యాంకు వెనుక వైపున ఉన్న అప్పటి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలోకి ఉపాధ్యాయ భవన్ వీధిలోంచి వెనుక వైపుగా వచ్చారు. బ్యాంకు కార్యాలయ పైకప్పునకు వేసిన సిమెంటు కాంక్రీటును అధునాతన ఇనుప బ్లేడ్లతో కోశారు. మనిషి గదిలోకి దిగేలా రంధ్రం ఏర్పాటు చేసుకున్నారు. పక్కాగా దొంగలు లాకర్ల వద్ద దిగి మూడు లాకర్లను మెండి తెరిచారు. మూడు లాకర్లతో ఒక లాకరు మాజీ చైర్మన్ గౌతమ్‌కు చెందినది కాగా...మరో లాకరు అమెరికాలో నివాసం ఉంటున్న పెరుమాళ్ అనే వ్యక్తిది. మరొకటి ఎవరిదన్నది ఇప్పటికీ అధికారులు చెప్పడం లేదు.

బంగారంతో పాటు వజ్రాలహారం మాయం

మొత్తం మూడు లాకర్లు తెరిచిన దొంగలకు ఎన్ఆర్ఐ పెరుమాళ్‌కు చెందిన లాకర్లో భారీ మొత్తంలో బంగారంతోపాటు వజ్రాల హారం లభించింది. చోరీ జరిగిన విషయాన్ని బహిర్గతం చేసిన అప్పటి పోలీసులు ఎంత సొత్తు చోరీకి గురైంది మాత్రం వెల్లడించలేదు. పాలక వర్గం గానీ నోరు మెదపలేదు. తాజాగా ఈ కేసును పోలీసుశాఖ ఆధారాలు లేని కారణంగా మూసేసినట్లు తెలిసింది. దీంతో మరోమారు చోరీ విషయం చర్చనీయాంశంగా మారింది.

పాలక వర్గం పనేనా?

టీడీపీ నేత, టౌన్ బ్యాంకు అధ్యక్షులు జేఎల్ మురళీధర్ పాలక వర్గం సమయం(2019)లో ఈ చోరీ జరిగింది. ఈ చోరీ జరిగిన అనంతరం ఖాతాదారుకు కనీసం సొత్తు రికవరీ చేసివ్వలేదు. దీంతో ఖాతాదారులు డిపాజిట్లు చేయాలన్నా, లాకర్‌లో విలువైన వస్తువులు దాచాలన్నా భయపడుతున్నారు. పైపెచ్చు చోరీ జరిగిన తీరు...మాజీ చైర్మన్ గౌతమ్‌కు, తాజా చైర్మన్ జేఎల్ మురళీధర్ మధ్య పచ్చ గడ్డేస్తే భగ్గుమనేది. ఈ నేపథ్యంలో కావాలనే గౌతమ్ లాకరుతో పాటు మరో రెండు లాకర్లలోని బంగారం చోరీ చేశారన్న వాదనలు వినిపించాయి. ఈ వాదనలను బలపరిచేలా పాలకవర్గం నేతలు కూడా వ్యవహరించారు. ఇంత పెద్ద ఎత్తున బంగారు, వజ్రాలు చోరీకి గురైతే స్పందించాల్సింది పోయి నేటిదాకా చోరీ కేసు పురోగతికి ఒక్క రోజు కూడా జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కలసి విన్నవించలేదు. ఖాతాదారుల సొత్తు పట్ల జవాబుదారీగా వ్యవహరించాల్సిన చైర్మన్ ఆ ఊసే మరచిపోయారు. తన రాజకీయ ఎదుగుదల మినహా బ్యాంకు అభివృద్ధి విషయంలో ఆయన శ్రద్ధ పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఆధారాలు లేవట!

టౌన్‌బ్యాంకులో చోరీకి సంబంధించి ఏ చిన్న ఆధారమూ లభించలేదని పోలీసులు చెబుతున్నారు. దొంగలు భవనం పైకప్పును మిషన్ బ్లేడ్లతో కోసి రంధ్రం ఏర్పాటు చేసుకుని లోపలకు ప్రవేశించారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కాగా బయట పాలకవర్గంలోని వారు మాత్రం మరోలా చెబుతున్నారు. బ్యాంకు సిబ్బంది సహకారంతోనే లోపలి నుంచి వెళ్లి లాకర్లను తెరిచి చోరీ చేశారని, పోలీసులను దారి మళ్లించేందుకు పైకప్పు డ్రామా ఆడారని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఇది దొంగల చేతివాటమా? దొరల పనా అనేది తేల్చాల్సింది పోలీసులే.

'ప్రత్యేక' తరగతులు!

- నిబంధనలకు తిలోదకాలిస్తున్న విద్యాసంస్థలు
- వేసవి సెలవులకు దూరమవుతున్న విద్యార్థులు
- తెలిసినా పట్టించుకోని విద్యా శాఖ అధికారులు

రాప్తాడురూరల్: రాజు నగరంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతూ ఇటీవలే పరీక్ష రాశాడు. వేసవి సెలవులు రావడంతో అమ్మమ్మ ఊరికి వెళ్లాలని ప్లాన్ చేశాడు. ఇంతలోనే స్కూల్ నుంచి రాజు తండ్రికి ఫోన్ వచ్చింది. 'వేసవి సెలవుల్లోనే పదో తరగతికి ప్రత్యేక తరగతులు ప్రారంభమవుతున్నాయి. ఫలానా తేదీ నుంచి పంపండి' అంటూ చెప్పారు. తల్లిదండ్రులు కంగారుపడి తమ కుమారుడిని ఊరికి పంపకుండా పాఠశాలకు పంపేలా నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తయిన అభిరామ్‌కు కూడా ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభవుతున్నాయంటూ కళాశాల నుంచి పిలుపువచ్చింది.

మానసిక ఆనందం దూరం

ప్రస్తుత పరిస్థితుల్లో విపరీతమైన పోటీతత్వం పెరగడంతో రోజూ తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు 'చదువు.. చదువు' అంటూ పిల్లలు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మానసిక ఆనందాన్ని కోల్పోతూ యాంత్రికంగా మారిపోతున్నారు. కనీసం సెలవు రోజుల్లోనైనా ప్రశాంతంగా ఆడుకునే అవకాశాలు కరువవుతున్నాయి. తల్లిదండ్రులు కూడా పాఠశాల యాజమాన్యాలు చెప్పిన విధంగానే మద్దతిస్తూ పిల్లలను మానసిక ఆనందానికి దూరం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మామూలుగానే సెలవు రోజుల్లో (ఆదివారం, రెండో శనివారం) కూడా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పెట్టుకుంటున్నారు. ఈ విషయం అటు విద్యాశాఖ అధికారులు, ఇటు ఇంటర్ అధికారులకు తెలిసినా స్పందించడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. 1-9 తరగతుల విద్యార్థులకు మే 1 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు వదిలారు. పేరుకే సెలవులు కానీ పని చేస్తున్న పాఠశాలలే ఎక్కువగా ఉన్నాయి. ఇంటర్ విద్యార్థులకు మే 31 వరకు సెలవులు ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదనే నిబంధనలను కార్పొరేట్ కళాశాలలు బుట్టదాఖలు చేస్తున్నాయి.

ఉపేక్షించేదే లేదు



ప్రభుత్వ షెడ్యూలు ప్రకారం కచ్చితంగా వేసవి సెలవులు వదలాల్సిందే. ప్రత్యేక తరగతుల పేరిట తరగతులు నిర్వహించినట్లు తెలిస్తే ఉపేక్షించేదే లేదు. అన్ని కళాశాలలకు నోటీసులు ఇచ్చాం. సీనియర్ ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక కమిటీలు వేసి ఆకస్మిక తనిఖీలు చేయిస్తాం. తరగతులు నిర్వహిస్తున్నట్లు తేలితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటాం.

– సురేష్‌బాబు, ఆర్‌ఐఓ

గుర్తింపు రద్దు చేస్తాం



వేసవి సెలవుల్లో తరగతుల నిర్వహణ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాం. కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నారనే సమాచారం వచ్చింది. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలతో పాటు నేను రంగంలోకి దిగుతా. ఆకస్మిక తనిఖీలు చేస్తాం. ఏ పాఠశాల కూడా వేసవి సెలవుల్లో పిల్లలకు ఎలాంటి తరగతులూ నిర్వహించరాదు. ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలితేమాత్రం గుర్తింపు రద్దు చేసేందుకు కూడా వెనుకాడం.

– సాయిరామ్, డీఈఓ

నేటి నుంచి ఎన్‌బీఏ పీర్ కమిటీ పర్యటన

- జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులు తనిఖీలు
- నాణ్యతా ప్రమాణాల మదింపు అనంతరం ఎన్‌బీఏ గుర్తింపు

అనంతపురం: ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు ఇవ్వడానికి పీర్ కమిటీ మూడు రోజుల పాటు జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో పర్యటించనుంది. కళాశాలలో సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు మూడేళ్ల కాలపరిమితితో 2019లో ఎన్‌బీఏ గుర్తింపు దక్కింది. తాజాగా తిరిగి ఎన్‌బీఏ గుర్తింపునకు దరఖాస్తు చేశారు. ఎన్‌బీఏ పీర్ కమిటీ శుక్ర, శని, ఆదివారాల్లో కళాశాలలో పర్యటించి నాణ్యతా ప్రమాణాలు మదింపు చేయనుంది. సివిల్, కెమికల్ ఇంజినీరింగ్‌లో వసతులు, విద్యార్థి, అధ్యాపక నిష్పత్తి, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు, ల్యాబ్ సదుపాయాలతో పాటు ఇతర బ్రాంచ్‌లతో కామన్ ఉండే హాస్టల్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సాధించిన లక్ష్యాలు తదితర అంశాలను పరిశీలించనుంది.



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

ఎన్‌బీఏ పీర్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా మూడు సంవత్సరాలు, ఆరు సంవత్సరాల కాల వ్యవధితో కూడిన గుర్తింపు దక్కనుంది. ఎన్‌బీఏ గుర్తింపు దక్కితే నాక్ గ్రేడింగ్‌కు వెళ్లడానికి వీలు కలుగుతుంది. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో కేంద్ర రోడ్లు, రహదారుల శాఖ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎంటెక్ ((బ్రిడ్జి, టన్నెల్ కన్‌స్ట్రక్షన్) కోర్సు అమలు చేస్తున్నారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగం జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ కళాశాలలో తప్ప తక్కిన ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుబాటులో లేదు.

- సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలు రెండూ అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. విభాగాల పనితీరు సంతృప్తికరంగా ఉండడంతో తప్పనిసరిగా ఎన్‌బీఏ గుర్తింపు దక్కుతుందని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ధీమా వ్యక్తం చేశారు.

మూలాంశం రైతులకు చేరాలి

అనంతపురం అర్బన్: విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల చట్టాలపై అవగాహన పెంచుకుని నాణ్యమైన వ్యవసాయ మూలాంశాలు రైతులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ చట్టాలపై గురువారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డీఏఓ చంద్రానాయక్ అధ్యక్షతన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యవసాయ అధికారులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా రైతులకు సంక్షేమ ఫలాలు, నాణ్యమైన సేవలు సత్వరం అందేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ కమిషనరేట్ జేడీఏ కృపాదాస్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత ప్రమాణాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, కమిషనరేట్ ఏడీఏలు రాజన్, సుదర్శన్, మద్దిలేటి, సురేశ్‌రెడ్డి, రెండు జిల్లాల ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

క్లుప్తంగా

సీఎం జగన్ ఆశీర్వాదం తీసుకున్న మంత్రి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు

కళ్యాణదుర్గం: తమ పెళ్లి రోజును పురస్కరించుకుని మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని వారు గురువారం కలసి మాట్లాడారు. జ్ఞాపికను అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఈ నెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్ఓ గాయత్రిదేవితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఏ విధంగా అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, అత్యవసర వైద్య సిబ్బందిని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు బంద్ చేయించాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని చెప్పారు. ఆర్ఐఓ సురేష్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఏఓ వెంకట్రావు, ఏఎస్పీ హనుమంతు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కదిలిన వైద్యురాలి అక్రమాల డొంక

- సమగ్ర విచారణకు ఆదేశించిన కలెక్టర్ గౌతమి
- గతంలో ఆరోగ్య శాఖ తీసుకున్న చర్యలపై డీఎంహెచ్ఓ ఆరా



డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అక్రమాలకు సంబంధించి గతంలో ఆరోగ్యశాఖకు అందిన ఫిర్యాదులు, నమోదు చేసిన కేసుల వివరాలను డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయికి వివరిస్తున్న డెమో భారతి

అనంతపురం క్రైం: అధిక ఆదాయం కోసం పెడమార్గం పట్టి గర్భిణులు, బాలింతల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వజనాస్పత్రి వైద్యురాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అక్రమాల డొంక కదులుతోంది. ఇటీవల ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన గర్భిణి కవిత(25)కు అబార్షన్ చేసి, ఆమె మృతికి కారణమైన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ తీరును కలెక్టర్ గౌతమి తీవ్రంగా పరిగణిస్తూ.. మరోసారి లోతుగా విచారణ చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయిని ఆదేశించారు. దీంతో వైద్యాధికారులు రంగంలో దిగి గతంలో ఆమెపై నమోదైన కేసులు, ఇతర ఫిర్యాదులకు సంబంధించిన వివరాల సేకరణలో పడ్డారు.

అక్రమాలు ఇవే

కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అక్రమాలపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ వీరబ్బాయి, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, లీగల్ కన్సల్టెంట్ ఆశారాణి, తదితరులు గురువారం సమావేశమై పలు రికార్డులు పరిశీలించారు. డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై గతంలో నమోదైన కేసుల వివరాలను డీఎంహెచ్ఓకు డెమో భారతి వివరించారు. ఇందుకు సంబంధించి ఫైళ్లను తీసి చూపించారు.

- 2016లో కోవూర్‌నగర్‌లో ఏర్పాటైన అభిజ్ఞ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అనంతరం శ్రీనివాస్‌నగర్‌కు మార్చారన్నారు. కొన్నేళ్లుగా ఆ ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా డాక్టర్ లక్ష్మీకాంతమ్మ కొనసాగినట్లు తెలిపారు.
- 2019, జులై 2న ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామానికి చెందిన గీత(24) మూడో కాన్పుకు సంబంధించి గర్భంలో కవల ఆడపిల్లలు ఉన్నట్లుగా లింగనిర్ధారణ పరీక్ష చేసి నిర్ధారించి అభిజ్ఞ ఆస్పత్రిలో అబార్షన్ చేశారు. అదే నెల 4న గీత మృతి చెందింది. దీనిపై మరుసటి రోజున విచారణ చేపట్టిన అప్పటి డీఎంహెచ్ఓ డాక్టర్ కేవీఎన్ఎస్ అనిల్‌కుమార్.. అనుమతుల్లేకుండానే అబార్షన్లు చేస్తున్నట్లుగా గుర్తించి డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిబంధనకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్ష చేసిన స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు.
- 2020, డిసెంబర్‌లో ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామానికి చెందిన గర్భిణి రాధకు స్కాన్ చేసి మరోసారి ఆడబిడ్డే జన్మిస్తుందని చెప్పి అబార్షన్ చేశారు. అయితే అవశేషాలను పరిశీలించిన అనంతరం పిండం మగశిశువుగా తేలడంతో బాధిత కుటుంబీకులు అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు అధికారులు నోటీసులు జారీ చేశారు.
- 2020, ఆగస్టులో సర్వజనాస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న అనంతపురంలోని రాణినగర్ నివాసి సుబ్బమ్మకు గర్భసంచి కేన్సర్ ఉందని, కోవిడ్ కారణంగా ఆస్పత్రిలో సర్జరీలు చేయడం లేదని, తన ఆస్పత్రికి వస్తే సర్జరీ చేస్తానని మాయమాటలతో నమ్మించారు. అనంతరం తన ఆస్పత్రిలో సుబ్బమ్మకు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించిన కొన్ని రోజులకే ఆమె మృతి చెందింది. దీనిపై సుబ్బమ్మ భర్త రమేష్ ఫిర్యాదుపై జిల్లా వైద్యాధికారులు స్పందించారు.
- తాజాగా, ధర్మవరం మండలం చిగిచెర్లకు చెందిన కవిత (25)కు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి గర్భస్థ శిశువు ఆడపిల్లేనని నిర్ధారించారు. ఈ నెల 12న అబార్షన్ చేశారు. ఈ నెల 14న పరిస్థితి విషమించి కవిత మృతి చెందింది. ఇందులో రూత్ ఆస్పత్రి నిర్వహణకు అనుమతులు తీసుకోకుండానే కొనసాగించడంపై రెండు నోటీసులు జారీ చేసిన విషయాన్ని సమావేశంలో చర్చించారు.

చర్యలకు రంగం సిద్ధం: అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అక్రమాల డొంక కదలడంతో ఆమెపై కఠిన చర్యలకు రంగం సిద్ధమైనట్లు ఆరోగ్య శాఖలో తీవ్ర చర్చ సాగుతోంది. డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి ఇచ్చే నివేదిక ఆధారంగా కలెక్టర్ గౌతమి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్య



మృతుడు శివయ్య

బుక్కరాయసముద్రం: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం పసులూరుకు చెందిన శివయ్య (35), లక్ష్మి దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో పాటు బేల్దారిగా సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబపోషణ, సెంట్రింగ్ సామగ్రి కోసం అప్పులు చేశాడు. సకాలంలో అప్పులు తీర్చలేకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీంతో వారి ఒత్తిళ్లను తాళలేక అధిక వడ్డీ చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో రోజుల వ్యవధిలోనే అప్పుల భారం రూ.10 లక్షలకు చేరుకుంది. అప్పు చెల్లించాలంటూ నిత్యమూ వడ్డీ వ్యాపారులు వెంటపడి వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు కౌన్సెలింగ్

రాప్తాడు రూరల్: ఉమ్మడి జిల్లాలోని హై స్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలో పని చేసేందుకు దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లకు శుక్రవారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఈఓ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను డీఈఓ బ్లాగ్ స్పాట్‌లో ఉంచామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే వారు విద్యార్హత పత్రాలు, సర్వీస్ రిజిస్టర్ తీసుకురావాలని సూచించారు.

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత తెలిపారు. మొత్తం 440 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 424 (96.36 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత చెందారన్నారు. పరీక్ష ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

అనంతపురం టౌన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గృహ నిర్మాణాల అంశంపై గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరుకు సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధమైందని, ఈ క్రమంలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి గృహనిర్మాణ సంస్థ పీడీ కేశవనాయుడు పాల్గొన్నారు.

128 మందికి వినికిడి యంత్రాలు

అనంతపురం క్రైం: వినికిడి లోపంతో బాధపడుతున్న 128 మంది చిన్నారులకు యంత్రాలు అందించేలా సీఆర్‌సీ నెల్లూరు స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చిందని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు గురువారం ఉదయం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సక్ష్యం సంస్థ, డీఈఐసీ ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా జీజీహెచ్‌లో చిన్నారులకు బెరా పరీక్షలు నిర్వహించి, అందులో 128 మంది వినికిడి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. వీరందరికీ వినికిడి యంత్రాలను అందించేందుకు ముందుకు వచ్చిన నెల్లూరులోని సీఆర్‌సీ సంస్థను అభినందించారు. మరో రెండు వారాల్లోపు వినికిడి యంత్రాలు అందుతాయన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, జీజీహెచ్ ఈఎన్‌టీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీధర్‌రావు, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ఇన్‌చార్జ్ డాక్టర్ నారాయణస్వామి, సక్ష్యం ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, సహాయ కార్యదర్శి డాక్టర్ భానుకిరణ్, సీఆర్‌సీ ప్రతినిధి శంకర్ వర్లే, డీఈఐసీ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీవిద్య, మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంతోషం బాబుకు నచ్చదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: రాష్ట్రంలో పేదలు ఆర్థికంగా బలపడుతుంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు గిట్టడని, దీంతో పేదలకు అండగా నిలిచిన ప్రభుత్వంపై విష ప్రచారానికి తెరతీశారంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చారు. పేదల సొంతింటి కల సాకారం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఈ క్రమంలో అమరావతిలో 50వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అయితే చంద్రబాబుకు ఈ విషయం గిట్టక ప్రభుత్వం ఇచ్చే స్థలం మృతదేహాలను పూడ్చేందుకు కూడా సరిపోదంటూ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. 40 అడుగుల అంతర్గత రహదారులతో సీఆర్‌డీఏ పరిధిలో ప్రభుత్వం పక్కా లేఅవుట్లను రూపొందించి, పేదలకు మంజూరు చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో జగన్ గెలుపును అడ్డుకోవడం ఎవరి తరం కాదని అన్నారు.

ఇల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు

రాప్తాడు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల చెందిన మహబూబ్‌బాషా, దిల్‌షాద్ దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్న మహబూబ్‌బాషా అద్దె ఇంట్లో నివాసముంటూ ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి కొత్త ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో హై ఓల్టేజీ ప్రసారం కావడంతో మహబూబ్‌బాషా ఇంట్లో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న ఆయన హుటాహుటిన ఇంటికి చేరుకుని తాళం తీయడంతో అక్కడున్న వారు మంటలు అదుపు చేశారు. విలువైన సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు, కట్టుగుడ్డలు, గృహ నిర్మాణం కోసం అప్పు చేసి తెచ్చి పెట్టిన రూ.లక్ష కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రాప్తాడు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బి.నాగేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎస్సీ విభాగం రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు తదితరులు తాటిచెర్లకు చేరుకుని బాధితుడిని పరామర్శించారు. తన వంతు తక్షణ సాయంగా రూ.50 వేలను నాగేశ్వరరెడ్డి అందజేశారు. విషయాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి తెలిపి ప్రభుత్వం నుంచి సాయమందేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, విశ్వనాథ్, సచివాలయ కన్వీనర్లు రవీంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, పెద్దన్న పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

తాడిపత్రి అర్బన్: మండలంలోని వంగనూరు నివాసి రామాంజి(25) కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. భార్య రామక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని రోజులుగా హిస్టీరియాతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాపాడి తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం రామాంజి మృతి చెందాడు. మృతుడి భార్యర రామక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తాడిపత్రి రూరల్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ తెలిపారు.

కడుపునొప్పితో..

కణేకల్లు: స్థానిక పాత పోలీసుస్టేషన్ వెనుకవీధిలో నివాసముంటున్న అరుణ్‌కుమార్ (23) కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడేవాడు. పలు ఆస్పత్రుల్లో కుటుంబసభ్యులు చికిత్స చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన అరుణ్‌కుమార్... గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గవాచీకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో..

పెద్దవడుగూరు: మండలంలోని ముప్పాలగుత్తి నివాసి లక్ష్మయ్య (57) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం ఉదయం ఇంటి వెనుక క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కాస్త ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. ఘటనపై పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

- నిందితుల్లో ఒకరు ఆర్మీ జవాన్
- రూ.13.60 లక్షల విలువైన 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం




నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వ్యసనాలకు బానిసైన ఓ ఆర్మీ జవాన్.. మరో దొంగతో చేతులు కలిపి ద్విచక్ర వాహనాలను అపహరిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలను అనంతపురం మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు గురువారం వెల్లడించారు. అనంతపురంలోని ప్రియాంకనగర్‌కు చెందిన గులాం సద్దాం హుస్సేన్.. ఆర్మీ జవాన్‌గా అసోంలో పనిచేస్తున్నాడు. తాగుడు, జూదం లాంటి వ్యసనాలకు బానిసైన ఇతను తన తాహత్తుకు మించి అప్పులు చేశాడు. వీటిని తీర్చలేక వడ్డీ వ్యాపారులను తప్పించుకుని తిరిగే వాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే గార్లదిన్నె మండలం పెనకచెర్ల నివాసి రాజశేఖర్‌తో పరిచయమైంది. ఆ సమయంలో రాజశేఖర్ ఇచ్చిన సలహాతో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు ఇతరులు విక్రయించగా వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చుకోవాలని అనుకున్నాడు. దీంతో విధులకు సెలవుపట్టి అనంతపురానికి వచ్చిన సద్దాం హుస్సేన్.. రాజశేఖర్‌తో కలసి వాహనాలను అపహించడమే పనిగా పెట్టుకున్నాడు. అనంతపురం, బుక్కరాయసముద్రం, పామిడి, గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, ముదిగుబ్బ, నల్లమాడ, కర్నూలు జిల్లా బనగానపల్లిలో వీరు ద్విచక్ర వాహనాలను అపహరించి, అనంతపురం శివారులోని నేషనల్‌పార్క్ వద్ద ఉన్న ఓ పాడుబడిన షెడ్‌లో దాచారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గుత్తిరోడ్డులోని మార్కెట్‌యార్డు వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరినీ పోలీసుల అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.13.40 లక్షల విలువైన 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన మూడో పట్టణ పోలీసు సిబ్బందిని ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

రక్తదాతలు కాదు.. ప్రాణదాతలు

- రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కాపు భారతి, తదితరులు

అనంతపురం టౌన్: 'మీరు రక్త దాతులు కాదు.. ప్రాణదాతలు' అంటూ రక్తదానం చేసిన 300 మందికి పైగా విద్యుత్ ఉద్యోగులను రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అభినందించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం దొరక్క తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు స్పందించి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులు గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్ఈ సురేంద్రతో కలసి ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఒకరి రక్తదానం మరో ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లాలో రక్త నిల్వలు దారుణంగా పడిపోయాయన్నారు. ఇలాంటి తరుణంలో విద్యుత్ ఉద్యోగులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర మాట్లాడుతూ.. ఒక్క పిలుపుతో విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా తరలివచ్చి రక్తదానం చేయడం గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగించి, ఆపన్నులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈలు రమేష్, భూపతి, రాజశేఖర్, మల్లికార్జున, ఎస్ఏఓ బాలాజీ, ఏఓ రాజశేఖర్‌తో పాటు ఉద్యోగుల సంఘాల నాయకులు జితేంద్ర, అమర్, శ్రీనివాసులు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి రైతు మృతి





మల్లికార్జున మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి అంజినమ్మ (ఇన్‌సెట్‌లో) మల్లికార్జున (ఫైల్)

కళ్యాణదుర్గం: దాహం తీర్చుకునేందుకు వెళ్లిన ఓ యువ రైతు ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి చెందిన గోవిందప్ప, అంజినమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు మల్లికార్జున అలియాస్ అర్జున్ (39) వ్యవసాయ పనులతో పాటు వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతగా ఉంటూ గ్రామంలో అందరికీ సహాయ సహకారాలు అందిస్తున్నాడు. ఆయనకు భార్య అంజినమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గురువారం ఉదయం భార్య, తల్లి, అత్త, కుమారుడితో కలసి తనకున్న రెండెకరాల పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటను తొలగించేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం దాహం వేస్తుండడంతో నీటి కోసం పక్కనే ఉన్న తన చిన్నాన్న పరమేశ్వరప్ప పొలంలోని సంప్ వద్దకెళ్లాడు. నీటిని అందుకునే క్రమంలో అదుపు తప్పి సంప్‌లో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో పాటు ఈత రాకపోవడంతో ఆయన నీటమునిగాడు. విషయాన్ని గమనించిన 13 ఏళ్ల వయసున్న కుమారుడు అభినయ్ వెంటనే కేకలు వేస్తూ పరుగున వెళ్లి తల్లిని అప్రమత్తం చేయడంతో కుటుంబసభ్యులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకున్నారు. నీటిపై తేలియాడుతున్న మల్లికార్జునను వెలికి తీసి ఆటోలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలియగానే మల్లికార్జున మృతదేహంపై పడి తల్లి, భార్య రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కాగా, మల్లికార్జున మృతి విషయం తెలుసుకున్న మంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఆగిన ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి

- నరిపడా నిధులున్నా.. నిర్మాణాలపై నిర్లక్ష్యం
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- నెలకు రూ.2 లక్షలు వెచ్చిస్తున్నా బస్టాండ్‌లో అపరిశుభ్రత
- పట్టించుకోని ఆర్టీసీ ఉన్నతాధికారులు


కొత్తగా నిర్మిస్తున్న హాస్పిటల్


నిలిచిపోయిన పార్సిల్ కార్యాలయ నిర్మాణం

అనంతపురం సెంట్రల్: ప్రభుత్వం ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల కొరవడిన పర్యవేక్షణ..ఉన్నతాధికారుల ఉదాసీనత వెరసి.. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు, అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జిల్లా కేంద్రంలోనే ఆర్ఎం ఉన్నా ..ఆర్టీసీ బస్టాండ్ వైపు పర్యవేక్షించకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది బస్టాండ్ పరిశుభ్రతను విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో అత్యధికంగా ప్రయాణికులు రాకపోకలు సాగించే అనంతపురం ఆర్టీసీ డిపో పరిధిలో రూ. కోట్లు పనులు జరుగుతున్నాయి. ఏడు డిపోల పరిధిలో 3 వేల మంది కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. వారికి వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఆస్పత్రి ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా వైద్యుడిని నియమించింది. ఏళ్ల గడుస్తున్నా రేకుల షెడ్డులోనే వైద్యసేవలు అందిస్తున్నారు. పక్కా భవనానికి ప్రభుత్వం రూ. 60 లక్షలు వెచ్చించింది. 2021లో నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు జరుగుతూనే ఉన్నాయి.

ఇరుకు గదిలో కార్గో కార్యాలయం..

ప్రజారవాణాతో పాటు పార్సిల్ సరఫరాలో కూడా ఆర్టీసీ పురోగతి సాధిస్తోంది. జిల్లా కేంద్రంలో పార్సిల్ కార్యాలయం ప్రస్తుతం ఇరుకుగదిలో నిర్వహిస్తున్నారు. పక్కా భవనానికి ప్రభుత్వం రూ. 30 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులను అరకొర చేసి, పత్తాలేకుండా పోయాడు. దీంతో ఇరుకుగదిలో పార్సిల్ కార్యాలయం నిర్వహించాల్సి వస్తోంది. దీనికితోడు పార్సిల్ తీసుకెళ్లేందుకు వచ్చిన వారి వాహనాల పార్కింగ్ అక్కడే చేస్తుండడంతో బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది.

బస్టాండ్ పరిశుభ్రతను పట్టించుకోలేదు..

రోజూ వేలాదిగా ప్రయాణికులు రాకపోకలు సాగించే అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణకు ప్రభుత్వం నెలకు రూ. 2 లక్షలు వెచ్చిస్తోంది. నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 16 మంది కార్మికులతో బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. కాంట్రాక్టర్ కార్మికులకు జీతాలు ఇవ్వడంలేదని పరిశుభ్రతను పట్టించుకోలేదు. దీంతో బస్టాండ్ ఆవరణ అంతా అపరిశుభ్రంగా తయారైంది.

చర్యలు తీసుకుంటున్నాం

అనంతపురం డిపో పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు అలస్యంగా జరుగుతున్న మాట వాస్తవమే. బస్టాండ్ నిర్వహణ బాధ్యతలు నా పరిధిలో ఉండవు. ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఒత్తిడి చేయడంతోనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. ఖార్గో పార్సిల్ కార్యాలయ కాంట్రాక్టర్ టెండర్‌ను రద్దు చేసి, కొత్తవారికి ఇవ్వాలనుకుంటున్నాం . నా పరిధిలో రెండు జిల్లాలు ఉంటాయి. రెండుచోట్లా బాధ్యతలు చూసుకోవడం కష్టంగా ఉంది. అయినా వేగవంతంగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సురేంద్రబాబు, డీఈ, ఏపీఎస్ ఆర్టీసీ

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

- అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి


ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో ప్రధాన రహదారి నిర్మాణంలో ఉన్నందున ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని పలు కూడళ్లలో ఆయన డీఎస్పీ ప్రసాద్‌రెడ్డితో కలిసి పర్యటించారు. వాహనాల పార్కింగ్, తోపుడు బండ్ల నిర్వాహకులు రహదారులపైకి రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయంతో ప్రతి ఒక్కరూ అసౌకర్యానికి గురికావాల్సి ఉంటుందన్నారు. మండుతున్న ఎండలకు జనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే అవస్థలు పడతారన్నారు.

క్లుప్తంగా

నీటి సమస్య ఎక్కడున్నా తెలియజేయండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: వేసవికాలంలో గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య ఉండకూడదని, సమస్య ఎక్కడైనా ఉంటే వెంటనే తెలియజేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. మండలంలోని వేపచెర్ల గ్రామంలో అధికారులతో కలసి ఆమె పర్యటించారు. నీటి సమస్యపై గ్రామస్తులతో ఆరాతీశారు. ప్రస్తుతం తాగునీటి పథకం బోరు మరమ్మతు చేయించినట్లు తెలిపారు. అవసరమైతే ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఈవోఆర్డీ సత్యబాబు, పంచాయితీ సెక్రటరీలను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరికుమార్‌ను కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

ఆత్మకూరు: మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఎస్ఐ జనార్దన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐను ఎంపీపీ హేమలత, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, అంజినప్ప, ఎస్ఐను సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని, ప్రజలు కూడా తప్పకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మల్లన్న , వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్, మురళి, శ్రీరామ్, వలంటీర్లు అశోక్, రవీంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తపోవనంలోని శ్రీశివశక్తిసాయి మందిరంలో ఐదురోజుల పాటు నిర్వహించిన హనుమజ్జయంతి వేడుకలు గురువారం శ్రీవారి కల్యాణోత్సవంతో ముగిశాయి. వేదాద్రి ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం సీతారామ కల్యాణ మహోత్సవం, సాయంత్రం శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. చిన్మయామిషన్ శ్రీస్వామి ఆత్మవిదానంద సరస్వతి విశిష్ట అతిథిగా హాజరై అనుగ్రహ భాషణం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నాయక్, దేవేంద్ర పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు

రాప్తాడు: గ్రామాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని, సమస్యలుంటే నేరుగా తమను కలిసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు తెలిపారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యలయంలో విలేకరులతో మాట్లాడారు. భూములకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే నేరుగా తహసీల్దార్‌నే సంప్రదించాలన్నారు. తహసీల్దార్ మాకు తెలుసు..సమస్యలు మేము పరిష్కరిస్తామని దళారులు ఎవరైనా రైతుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ సమస్యలపై రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. అర్జీదారుడు నేరుగా వచ్చి తమ సమస్యను చెప్పి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

సర్వజనాస్పత్రిలో ఈవెనింగ్ ఓపీ సేవలు



అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పూర్తి స్థాయిలో గురువారం నుంచి ఈవెనింగ్ ఓపీ జరిగేలా జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామినాయక్, ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్ చర్యలు తీసుకున్నారు. మెడిసిన్, గైనిక్, సర్జరీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, పల్మనాలజీ, ఆర్థో, తదితర ఓపీలను తెరిచి ఉంచారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు కౌంటర్ 14లో ఓపీ తీసుకొని వైద్యం పొందారు. ప్రజలు ఓపీని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం శ్రీశ్రీ నగర్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతీ సాహితీ, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే సీఎం జగన్ అభిమతమన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ పేదలకు న్యాయం చేస్తుంటే ప్రతి పక్ష నాయకులు మాత్రం ఓర్వలేకపోతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందించడంతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదల సొంతింటి కల సాకారం చేశామన్నారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలో దాదాపు 30 వేల మందికి ఇంటి పట్టాలు అందించామన్నారు.

శ్రీశ్రీ నగర్ అభివృద్ధికి చర్యలు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీశ్రీ నగర్ కాలనీని పూర్తిగా విస్మరించారని ఎమ్మెల్యే అన్నారు. ఏళ్లుగా నివాసం ఉంటున్నా ఇంటి పట్టాల అందించాలని సీపీఎం నాయకులు, ప్రజలు పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల సమయంలో శ్రీశ్రీ నగర్ వాసులకు ఇచ్చిన హామీ మేరకు 273 మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. ఇంటి పట్టాలు పొందిన వారు ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి శ్రీశ్రీ నగర్‌లో నివాసం ఉన్న వారికి ఇళ్ల పట్టాలు అందించాలని పోరాడుతున్నామన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతోనే పేదలకు న్యాయం జరిగిందన్నారు. కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి శ్రీశ్రీ నగర్‌ను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, హుస్సేన్, రహీమ్, జగన్‌మోహన్‌రెడ్డి, కరీమ్, అంజి, సీపీఎం నాయకులు రామిరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న స్తంభాలను తక్షణం మార్చాలి


విద్యుత్‌శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి

అనంతపురం క్రైం: అనంతపురం నియోజకవర్గంలో దెబ్బతిన్న కరెంటు స్తంభాలను తక్షణం మార్చాలని విద్యుత్‌శాఖ సిబ్బందిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. గురువారం ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర చాంబర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 307 స్తంభాలు మార్చాలని ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో 156 మాత్రమే పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలినవి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. రాణినగర్, అంబేడ్కర్‌నగర్, పాతూరు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు వస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో దెబ్బతిన్న పోళ్లను గుర్తించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. డీ 4 పరిధిలో చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. రుద్రంపేట, నారాయణపురంలో విద్యుత్ స్తంభాలు కాలువల్లో ఉన్నాయని, వాటిని తక్షణం మార్చాలన్నారు. ఎస్ఈ సురేంద్ర, ఏఈలు ప్రసాద్, నారాయణమ్మ, అధికారులు పాల్గొన్నారు.

గదులు సబ్‌లీజుకు ఇవ్వకూడదు

- అభ్యర్థులకు జేసీ కేతన్‌గార్గ్ సూచన


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులను కేటాయిస్తే, తిరిగి వాటిని సబ్‌లీజుకు ఇవ్వకూడదని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అభ్యర్థులకు సూచించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడు గదులను ఎస్సీ కోటా కింద రిజర్వు చేశారు. వీటిని భర్తీ చేసేందుకు జేసీ గురువారం తన చాంబర్‌లో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. గదులను కేటాయిస్తే మీరే వ్యాపారం చేసుకుంటారా? లేక ఇతరులకు అద్దెకు ఇస్తారా? అంటూ అభ్యర్థులను ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం లీజుదారుడు సబ్‌లీజుకు ఇస్తే చట్ట ప్రకారం లీజు రద్దవుతుందన్నారు. నగర పాలక సంస్థ నిబంధనల మేరకు లీజు చెల్లించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ రమణారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఎసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కల్పించండి

- రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపుభారతి


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: హెచ్‌ఐవీ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి తెలిపారు. హెచ్‌ఐవీ నియంత్రణ టీకా దినోత్సవ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర అనుబంధ సంస్థలైన ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెడ్ క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాపు భారతి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బారిన పడకుండా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవడంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలన్నారు. మహిళలు కాన్పుల సమయంలో ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ టెస్టు చేయించుకోవాలన్నారు. అనంతరం సొసైటీ సభ్యులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ రహదారిలో తిరిగే లారీ డ్రైవర్లు, నగరంలో తిరుగుతున్న ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బీసాతి భరత్, ప్రగతి పథం సంస్థ అధ్యక్షుడు జయ మారుతి, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు దివ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణు ప్రియ, వలంటీర్లు నందిత, జ్యోత్స్న, ఆజాం, ప్రదీప్, మహేష్, తుకారం, జి.గౌతందీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో ఆడిటింగ్


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ శాఖ రీజనల్ డైరెక్టర్ గోవిందప్ప, జిల్లా అధికారిణి ఇందిర

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ఆడిటింగ్ శాఖ అధికారులు గురువారం ఆడిటింగ్ నిర్వహించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో కొన్ని లోపాలను గుర్తించి, రాబోవు ఆర్థికసంవత్సరంలో అవి పునరావృతం కాకుండా చూసుకోవాలని డిప్యూటీ సీఈఓ అమృత రాజ్‌కు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్లు చంద్రశేఖరరెడ్డి, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్పు పరికరాలకు నిప్పు

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని వ్యవసాయ పొలంలోని డ్రిప్పు పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నిప్పు పెట్టారు. దీంతో 20 కట్టల డ్రిప్పు వైరు, పైపులు కాలిపోయాయి.దీంతో రూ.60 వేల దాకా నష్టపోయినట్లు బాధిత రైతు పి. ముత్యాలు తెలిపారు. ఈ మధ్యనే మొక్కజొన్న పంట కోసి, పొలంలోనే డ్రిప్పు పరికరాలు వేశామని, పొలానికి సమీపంలోని చెత్తకు ఎవరో నిప్పు పెట్టారన్నారు.

చారిత్రక సంపదను కాపాడుకుందాం


మాట్లాడుతున్న పురావస్తు శాఖ ఏడీ రజిత

అనంతపురం కల్చరల్: జిల్లాలో ఎంతో అద్భుతమైన చారిత్రక వారసత్వ సంపద ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పురావస్తు శాఖ ఏడీ రజిత అన్నారు. గురువారం మ్యూజియం దినోత్సవం స్థానిక పీస్ మెమోరియల్ హాలులో ఘనంగా నిర్వహించారు. పురావస్తు శాఖ, ఇంటాక్, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ అధ్యక్షత వహించారు. ఏడీ రజిత, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్ వేణుగోపాలరెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, వినియోగదారుల సంఘం రవీంద్రనాథ్ రెడ్డి, రెడ్డి జన సంఘ్ కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ చంద్రహాసరెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. అంతకు ముందు గాయకుడు సాధుశేఖర్ ఆలపించిన గీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో లెక్చరర్ పద్మావతి, సాహితీవేత్తలు రియాజుద్దీన్, నబీ రసూల్, షరీఫ్, సూర్యనారాయణరెడ్డి, గుప్తా, మాసూంబాబా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలని నిరసన



కాగడాలతో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం అర్బన్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణం అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ నుంచి సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సప్తగిరి సర్కిల్ వరకు కాగడాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నాగేంద్ర కుమార్, డాక్టర్ ప్రసూన మాట్లాడారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని మహిళారెజ్లర్లు 25 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారన్నారు. మహిళారెజ్లర్లను తక్షణం పిలిపించి, మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీని తక్షణం అధికార, రాజకీయ పదవుల నుంచి తొలగించాలన్నారు. ఘటనపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి, దోషులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగమణి, రామాంజనమ్మ, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, పరమేశ్, వెంకటనారాయణ, ముస్కిన్, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో లాభాలు

కూడేరు: మిశ్రమ ఆహార పంటల సాగుతో అనేక లాభాలను పొందవచ్చని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ మండల టీం లీడర్ నారాయణరెడ్డి, విలేజ్ అగ్రి అసిస్టెంట్ రాజకుమార్ సూచించారు. గురువారం కూడేరు మండలంలోని కరుట్లపల్లిలో ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో మహిళా రైతులకు మిశ్రమ ఆహార పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిరు ధాన్యాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. తక్కువ విస్తీర్ణంలో మిశ్రమ ఆహార పంటలు సాగు చేస్తే కొన్ని పంటలు దెబ్బతిన్నా .. మరికొన్ని పంటలైనా ఆదుకుంటాయన్నారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మిశ్రమ ఆహార పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది రామలింగ, రామాంజనేయులు, ప్రియాంక, గౌతమి, అక్కమ్మ, శ్రీలత, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో వీడ్కోలు సభ



ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం ఆర్ట్స్ కళాశాల వాణిజ్య–నిర్వహణ శాస్త్ర విభాగం చివరి సంవత్సరం విద్యార్థులకు గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ వాణిజ్య శాస్త్ర విభాగానికి కావాల్సిన సదుపాయాలు సమకూర్చామన్నారు. కళాశాలలో ఎక్కువ మంది విద్యార్థులు కామర్స్ అభ్యసిస్తున్నారన్నారు. వర్చువల్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఇతర అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వీటన్నింటినీ సక్రమంగా వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్కేయూ ఆచార్యులు ప్రొఫెసర్ రమణ మాట్లాడుతూ బీకాం, బీబీఏ కోర్సులకు అవకాశాలకు ఆకాశమే హద్దు అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యక్షుడు శ్రీరాములు, నిర్వహణ శాస్త్ర అధ్యక్షుడు డాక్టర్ రంగనాథ్, ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, శేఖర్, రవీంద్రారెడ్డి, వెంకటస్వామి, షర్మిల, సుమంగళి తదితరులు పాల్గొన్నారు.

21న మెగా కంటి వైద్యశిబిరం

పామిడి: స్థానిక షాదీఖానాలో ఈనెల 21న పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఓటర్, ఆధార్, రేషన్‌కార్డుల్లో ఏదోకటి లేదా ఏదైనా గుర్తింపుకార్డుల రెండు జిరాక్స్ కాపీలు, సెల్ నంబర్‌తో శిబిరానికి రావాల్సి ఉంటుందని అన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: ఐసీడీఎస్ పరిధిలోని శిశుగృహలో కాంట్రాక్టు ప్రాతిపదికన రెండు ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 20న కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
129	52
61,432	18,130

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,612	▲	111
డోజోన్స్	33,276	▼	145
ఎఫ్‌టీఎస్ఈ 100	7,742	▲	19
డాక్స్	16,163	▲	212
షాంఘై	3,297	▲	13
నికాయ్	30,574	▲	480

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,474
బంగారం (99.5 స్వచ్ఛత)	60,232
వెండి (కిలో)	71,496

ఇండిగోకు లాభాలు

క్యూ4లో రూ.919 కోట్లు



న్యూఢిల్లీ: ఇండిగో బ్రాండ్‌పై విమానయాన సేవలు అందించే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్చి త్రైమాసికంలో లాభాల్లోకి అడుగు పెట్టింది. రూ.919 కోట్ల లాభాన్ని ప్రకటించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఆర్జించిన రూ.253 కోట్లను మినహాయించి చూస్తే నికర లాభం రూ.664 కోట్లుగా ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో ఇండిగో రూ.1682 కోట్ల నష్టాన్ని చూడడం గమనార్హం. మొత్తం ఆదాయం మార్చి త్రైమాసికంలో 78 శాతం పెరిగి రూ.14,600 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.8,207 కోట్లుగా ఉంది. ప్రయాణికుల టికెట్ల రూపంలో ఆదాయం 80 శాతం పెరిగి రూ.12,434 కోట్లుగా ఉంటే, యాన్సిలరీ ఆదాయం (బ్యాగేజీ, ఫుడ్ తదితర) 37 శాతం వృద్ధితో రూ.1,445 కోట్లుగా ఉన్నట్టు ఇండిగో ప్రకటించింది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి విదేశీ మారకం ప్రభావాన్ని మినహాయించి చూస్తే రూ.2,654 కోట్ల లాభం సమకూరింది. కానీ, విదేశీ మారకం ప్రభావాన్ని కలిపి చూస్తే రూ.306 కోట్ల నష్టం సమకూరింది. రూ.44,854 కోట్ల నికర రుణ భారం ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు రెండు శాతం నష్టపోయి రూ.2,264 వద్ద క్లోజయింది.

జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు విశేష స్పందన

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్- జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. సంస్థ ప్రకటించిన ఈ సంవత్సరపు అతిపెద్ద జ్యువెలరీ ఫెస్టివల్‌లో మే 12 నుంచి గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్, వెండి జ్యువెలరీపై పలు ఆఫర్లు అమలవుతున్నాయి. జూన్ 11 వరకూ ఈ ప్రత్యేక 'ఆభరణాల పండుగ' నిర్వహణ జరుగుతుంది. మజూరీ చార్జీలపై 50 శాతం వరకూ తగ్గింపు, ప్రతి కొనుగోలుపై కస్టమర్‌కు ఉచిత జీవితకాల నిర్వహణ, సంవత్సరంపాటు ఉచిత బీమా, బైబ్యాక్ హామీ వంటి ఎన్నో ఆఫర్లు ఇందులో భాగంగా ఉన్నాయి.



ఎస్‌బీఐ లాభం జూమ్

- 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లు
- షేరుకు రూ.11.30 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ మార్చి త్రైమాసికానికి మెరుగైన పనితీరు చూపించింది. ఎన్‌పీఏలకు కేటాయింపులు తగ్గడంతో విశ్లేషకుల అంచనాలకు మించి ఫలితాలను ప్రకటించింది. స్టాండలోన్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.9,113 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 29 శాతం పెరిగి రూ.40,393 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నికర వడ్డీ ఆదాయం రూ.31,198 కోట్లుగా ఉండడం గమనార్హం. ఒక్కో షేరుకు రూ.11.30 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. మొండి రుణాలకు (ఎన్‌పీఏలు) కేటాయింపులు, కంటింజెన్సీలు 54 శాతం తగ్గి రూ.3,316 కోట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో కేటాయింపులు రూ.7,237 కోట్లుగా ఉన్నాయి. ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 2.78 శాతానికి తగ్గాయి. ఇవి క్రితం ఏడాది ఇదే త్రైమాసికం నాటికి



3.97 శాతంగా ఉంటే, 2022 డిసెంబర్ చివరికి 3.14 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.67 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది మార్చి చివరికి ఇవి 1.08 శాతం, 2022 డిసెంబర్ చివరికి 0.77 శాతంగా ఉండడం గమనార్హం. దేశీయ వ్యాపారంపై నికర వడ్డీ మార్జిన్ 3.84 శాతానికి పుంజుకుంది.

- మార్చి త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ నికర లాభం (అనుబంధ సంస్థలతో కలిపి) క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.9,994 కోట్ల నుంచి రూ.18,343 కోట్లకు వృద్ధి చెందింది. 90 శాతానికి పైగా పెరిగింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,08,034 కోట్ల నుంచి, రూ.1,36,852 కోట్లకు పెరిగింది.
- మార్చి త్రైమాసికానికి నిర్వహణ లాభం 25 శాతం వృద్ధితో రూ.24,621 కోట్లకు చేరుకుంది.
- ప్రొవిజన్ కవరేజ్ రేషియో 1.35 శాతం మెరుగుపడి 76.39 శాతంగా ఉంది.
- రుణాల్లో 16 శాతం వృద్ధి నమోదైంది. మార్చి చివరికి రూ.32.69 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ రుణాలు వార్షికంగా 12 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలు 18 శాతం పెరిగాయి.
- డిపాజిట్లు 9 శాతం వృద్ధితో రూ.44.23 లక్షల కోట్లకు చేరాయి.
- 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ స్టాండలోన్ నికర లాభం రూ.50,232 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2021-22)తో పోలిస్తే 58 శాతం పెరిగింది. స్టాండలోన్ ఆదాయం రూ.1,06,912 కోట్లుగా నమోదైంది.
- 2022-23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం రూ.35,374 కోట్ల నుంచి రూ.56,558 కోట్లకు చేరింది. ఆదాయం రూ.4,06,973 కోట్ల నుంచి రూ.4,73,378 కోట్లకు చేరింది.
- బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 2 శాతానికి పైగా నష్టపోయి రూ.574 వద్ద క్లోజ్ అయింది. ఇంట్రాడేలో రూ.571.40 కనిష్ట స్థాయిని చూసింది.

చివరికి నష్టాల్లో..

మార్కెట్లు వరుసగా మూడో రోజు డౌన్



ముంబై: దిగ్గజ సంస్థలు ఐటీసీ, ఎస్‌బీఐ ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోవడం తదితర అంశాల కారణంగా దేశీ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. గురువారం దాదాపు రోజంతా లాభాల్లోనే ట్రేడయినప్పటికీ ఆఖర్లో సెన్సెక్స్ 129 పాయింట్లు కోల్పోయి 61,432 వద్ద, నిఫ్టీ 52 పాయింట్ల నష్టంతో 18,130 వద్ద క్లోజయ్యాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 61,956-61,349 పాయింట్ల గరిష్ట, కనిష్ట స్థాయిలో తిరుగాడింది. అంతర్జాతీయంగా సానుకూల ధోరణులు నెలకొన్నప్పటికీ, ఆరంభ లాభాలను కోల్పోయి నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగం హెడ్ దీపక్ జసానీ తెలిపారు. వారాంతపు ఎక్స్‌పైరీ రోజున మార్కెట్లు ఒడిదుడుకుల్లో ట్రేడయినట్లు, నిర్దిష్ట స్టాక్స్‌లో లాభాల స్వీకరణతో సూచీలు నష్టాల్లో ముగిసినట్లు రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో టైటాన్, పవర్ గ్రిడ్, ఎల్అండ్‌టీ, టాటా మోటార్స్ మొదలైనవి నష్టపోయాయి. ఐటీసీ 2%, ఎస్‌బీఐ 1.77% క్షీణించాయి. బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ మొదలైనవి లాభపడ్డాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.67%, స్మాల్‌క్యాప్ 0.26% క్షీణించాయి. ఇతర సూచీల్లో రియల్టీ 2.29%, సర్వీసెస్ 1.60%, పవర్ 1.43% తగ్గాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్ లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు చూస్తే.. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

25 పైసలు తగ్గిన రూపాయి..

విదేశీ మార్కెట్లలో డాలరు బలపడటం, దేశీ ఈక్విటీల్లో బలహీన ట్రెండ్‌తో దేశీ కరెన్సీ రూపాయి మారకం విలువ గురువారం 25 పైసలు క్షీణించింది. డాలరుతో పోలిస్తే 82.62 వద్ద క్లోజయ్యింది.

టైమెక్స్ చేతికి జస్ట్ వాచెస్

న్యూఢిల్లీ: గడియారాల తయారీలో ఉన్న యూఎస్ కంపెనీ టైమెక్స్ గ్రూప్ తాజాగా ప్రీమియం వాచ్ రిటైల్ బ్రాండ్ జస్ట్ వాచెస్‌ను కొనుగోలు చేసింది. డీల్ విలువను కంపెనీ వెల్లడించలేదు. ఈ డీల్ ద్వారా టైమెక్స్ ఇండియా చేతికి జస్ట్ వాచెస్ స్టోర్లు, ఈ-కామర్స్ పోర్టల్ అయిన జస్ట్‌వాచెస్.కామ్ వచ్చి చేరాయి. 'మా భవిష్యత్ వృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా ఈ కొనుగోలు ఉంటుంది. రెండు బ్రాండ్‌ల కలయిక మధ్య ఒక కచ్చితమైన సహకారం తెస్తుంది. వినియోగదారులకు విస్తృత స్థాయిలో వాచెస్‌ను ఎంపిక చేసుకునేందుకు వీలు కల్పిస్తుందని విశ్వసిస్తున్నాము' అని టైమెక్స్ గ్రూప్ తెలిపింది. జస్ట్ వాచెస్‌ను దక్కించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా కస్టమర్ల సంఖ్యను పెంచుకోవడానికి సన్నద్ధం అయ్యామని టైమెక్స్ ఇండియా ఎండీ దీపక్ ఛబ్రా అన్నారు. టైమెక్స్ వరల్డ్ పేరుతో టైమెక్స్ ఇండియా దేశవ్యాప్తంగా 35 ఎక్స్‌క్లూజివ్ ఫ్రాంచైజీ స్టోర్లను నిర్వహిస్తోంది.



ఐటీసీ లాభం భళా

- మార్చి క్వార్టర్‌లో రూ.5,225 కోట్లు
- ఎఫ్ఎంసీజీలో బలమైన వృద్ధి
- ఒక్కో షేరుకు రూ.9.5 డివిడెండ్

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ, హోటళ్లు, పేపర్ తదితర వ్యాపారాల్లోని ఐటీసీ లిమిటెడ్ మార్చి త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూసినప్పుడు 23 శాతం వృద్ధితో రూ.5,225 కోట్లుగా నమోదైంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 7 శాతం వృద్ధితో రూ.18,799 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.4,260 కోట్లు, ఆదాయం రూ.17,754 కోట్లు చొప్పున ఉంది. కంపెనీ వ్యయాలను సమర్థవంతంగా అదుపు చేసింది. కేవలం 2 శాతమే పెరిగి రూ.12,901 కోట్లుగా ఉన్నాయి. అన్ని విభాగాల్లోనూ బలమైన వృద్ధిని కొనసాగించినట్టు ఐటీసీ లిమిటెడ్ తెలిపింది. 2022-23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఐటీసీ కన్సాలిడేటెడ్‌గా రూ.19,428 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం (2021-22)లో లాభం రూ.15,486 కోట్లతో పోలిస్తే 25 శాతం వృద్ధి చెందింది. ఆదాయం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 17 శాతానికి పైగా



పెరిగి రూ.75,826 కోట్లకు చేరుకుంది. ఐటీసీ నిర్వహణ ఆదాయం రూ.75,000 కోట్లు దాటడం ఇదే మొదటిసారి.

విభాగాల వారీగా..

మార్చి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ విభాగం (సిగరెట్లు సహా) ఆదాయం 15 శాతం పెరిగి రూ.13,033 కోట్లుగా ఉంది. ఇందులో సిగరెట్ల ఆదాయం వరకే చూస్తే 13 శాతం వృద్ధితో రూ.8,082 కోట్లుగా ఉంది. చట్టవిరుద్ధమైన మార్గాల్లో సిగరెట్ల సరఫరాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ తీసుకున్న చర్యలు ఫలితమిచ్చినట్టు ఐటీసీ తెలిపింది. సిగరెట్లు కాకుండా ఇతర ఎఫ్ఎంసీజీ ఆదాయం వరకే చూస్తే 19 శాతానికి పైగా పెరిగి రూ.4,951 కోట్లుగా ఉంది. పేపర్‌బోర్డ్స్, ప్యాకేజింగ్ ఆదాయం 2% పెరిగి రూ.2,221 కోట్లుగా ఉంది. షేరుకి తుది డివిడెండ్ కింద రూ.6.75, ప్రత్యేక డివిడెండ్ కింద రూ.2.75 (మొత్తం రూ.9.5) చొప్పున ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

భారత్‌లో రూ. 1.05 లక్షల కోట్ల పెట్టుబడులు

2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాపై అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రణాళికలు

న్యూఢిల్లీ: భారత్‌లో క్లౌడ్ సేవలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. 2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై 12.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,05,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 2016-2022 మధ్య కాలంలో చేసిన 3.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 30,900 కోట్లు) కూడా కలిపితే దీర్ఘకాలంలో 2030 నాటికి తమ పెట్టుబడులు 16.4 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 1,36,500 కోట్లు) చేరినట్లవుతుందని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది. డేటా సెంటర్ మౌలిక సదుపాయాలపై కొత్త ప్రతిపాదిత పెట్టుబడులతో భారతీయ వ్యాపార సంస్థల్లో ఏటా సగటున 1,31,700 పూర్తి స్థాయి కొలువులకు సరిసమానమైన ఉద్యోగాల కల్పన జరగగలదని వివరించింది. నిర్మాణం, ఫెసిలిటీ మెయింటెనెన్స్, ఇంజినీరింగ్, టెలీకమ్యూనికేషన్స్ మొదలైన విభాగాల్లో ఇవి ఉండగలవని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది.



రెండు డేటా సెంటర్లు..

ఏడబ్ల్యూఎస్‌కు భారత్‌లో రెండు డేటా సెంటర్ ఇన్‌ఫ్రా రీజియన్లు ఉన్నాయి. ఏడబ్ల్యూఎస్ ఏషియా పసిఫిక్ రీజియన్‌లను 2016లో ముంబైలో ఒకటి, 2022లో హైదరాబాద్‌లో మరొకటి ప్రారంభించింది. వ్యయాలు తగ్గించుకునేందుకు, నవకల్పనలను వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు, మార్కెట్‌ను సత్వరం అందిపుచ్చుకునేందుకు దేశీయంగా వేలకొద్దీ క్లయింట్లు తమ సేవలను ఉపయోగిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మొదలుకుని అశోక్ లేల్యాండ్, యాక్సిస్ బ్యాంక్ వంటి దిగ్గజాలు, ఇతరత్రా స్టార్టప్‌లు మొదలైనవెన్నో వీటిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

యువర్స్

• గేమింగ్

అదిగో...ఆ బంకర్‌లోనే!



ఈ నెలలో విడుదల అనుకున్న ఫస్ట్ పర్సన్ హారర్ గేమ్ 'అమ్నేసియా: ది బంకర్' జూన్ 6న విడుదల కానుంది. అమ్నేసియా సిరీస్‌లో భాగంగా వస్తున్న నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ప్లేయర్స్ ఫ్రెంచ్ సైనికుడు హెన్రీ క్లెమెంట్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి. సేఫ్ ప్లేస్ ఏమిటో తెలుసుకోవాలి. ఒక బంకర్ మిస్టరీని ఛేదించాలి.

జానర్స్: అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్ **ఇంజిన్:** హెచ్‌పీఎల్ ఇంజిన్, హెచ్‌పీఎల్ ఇంజిన్ 3.5 **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ఎక్స్ బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సీరీస్ ఎక్స్ అండ్ సీరీస్ ఎస్

అవును... ఇది నిజమే!



క్వీన్ విక్టోరియన్ శకం (బ్రిటన్)లో పువ్వుల భాష 'ఫ్లోరియోగ్రఫీ'గా ప్రసిద్ధి పొందింది. వ్యక్తులు తమ భావాలు, సెంటిమెంట్లను ఇతరులతో పంచుకోవడానికి రకరకాల పువ్వులను ఉపయోగించేవారు. ప్రతి పువ్వుకు సింబాలిక్ మీనింగ్ ఉండేది. ఉదా: రెడ్ రోజ్-స్వచ్ఛమైన ప్రేమ, ఎల్లో రోజ్-స్నేహం, పింక్ రోజ్-ఆరాధన, సన్‌ఫ్లవర్-నమ్మకం, విశ్వాసం. కలర్స్, అరేంజ్‌మెంట్స్ అనేవి 'రహస్య సందేశం'లో కీలకపాత్ర పోషించేవి. ఒక్కో పువ్వుకు మాత్రమే కాకుండా పువ్వుల సముదాయానికి కూడా ప్రత్యేక అర్థాలు ఉండేవి. ఆ కాలంలో ప్రేమవ్యక్తీకరణకు అంతగా స్వేచ్ఛ లేకపోవడంతో ఈ పువ్వుల భాషను ఉపయోగించేవారు.

అడవి రాసిన కవిత్వం

• మోతీరామ్ సాహితీయజ్ఞం

అమ్మ... తియ్యనైన పదం. అమ్మ భాష... మృదుమధురం. అడవిలో పుట్టిన సంస్కృతి... అడవి పురుడు పోసిన సాహిత్యం. నాగరకత దాడికి లోనవుతుంటే... అడవి బిడ్డ గుండె కన్నీరవుతోంది. అమ్మ భాష కోసం కలం పట్టాడు... అందమైన గ్రంథరూపమిస్తున్నాడు. కొలామ్ భాష కోసం ఆత్రం మోతీరామ్ చేస్తున్న సాహిత్య సేవ ఇది.



ఆత్రం మోతీరామ్

తెలంగాణ రాష్ట్రం, కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా(ఉమ్మడి ఆదిలాబాద్) వాంకిడి మండలంలోని నగర్‌గుట్టలో పుట్టాడు ఆత్రం మోతీరామ్. కొలామ్ తెగకు చెందిన మోతీరామ్ తమ భాషలో పుట్టిన అచ్చమైన స్వచ్ఛమైన పదాలు అంతరించిపోతున్నాయని తెలుసుకుని ఆవేదన చెందాడు. గ్రంథస్థం చేయడమే పరిష్కారం అని భావించి మౌఖికంగా ఉన్న అడవి పదాలు, పాటలను అక్షరబద్ధం చేస్తున్నాడు. తన అనుభవాలు, అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నాడీ యువకుడు.

అడవి నేర్పిన అక్షరాలు

''మా ఊరి పాఠశాలలో రెండోతరగతి చదివాను. ఆ తరవాత చౌపన్‌గూడ శాటిలైట్ సెంటర్ ఆశ్రమ పాఠశాలలో చేర్చేటప్పుడు మళ్లీ ఒకటో తరగతిలో చేర్చాడు మా నాన్న. నాలుగవ తరగతి తర్వాత ఆసిఫాబాద్ పీటీజీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాను. ఉట్నూరు గవర్నమెంట్ కాలేజ్‌లో బీఎస్సీ, ఐటీడీఏ శిక్షణ కళాశాలలో బీఈడీ చేశాను. ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య విధానంలో ఎం.ఏ తెలుగు చేస్తున్నాను.



మోతీరామ్ రచనలు

బొమ్మల సాహిత్యం

నా సాహిత్య ప్రస్థానం గురించి చెప్పాలంటే... అది చిత్రలేఖనంతో మొదలైంది. మా నాన్న వ్యవసాయంతోపాటు వడ్రంగం కూడా చేసేవాడు. తలుపుల మీద నెమలి, పూలు, చెట్లు, పండ్లు... ఇలా రకరకాలు చిత్రించేవాడు. వాటిని పరిశీలనగా చూసి నేనూ బొమ్మలు వేసేవాడిని. గురుకుల పాఠశాలలో చిత్రలేఖనం పోటీల్లో కూడా పాల్గొన్నాను. ఎనిమిదవ తరగతికి వచ్చినప్పటి నుంచి నేను వేసిన బొమ్మలకు చిన్న వ్యాఖ్యానం రాయడం మొదలు పెట్టాను. నాకు పెద్ద పెద్ద విషయాలు తెలిసి కాదు, నా మనసుకు అనిపించిన విషయాన్ని అచ్చంగా అలాగే రాసేవాడిని. మా సత్యనారాయణ సార్ నేను రాసిన వ్యాఖ్యానంలో అక్షరదోషాలు, వ్యాకరణ దోషాలను దిద్దేవారు. నేను వ్యక్తం చేసిన భావాలనే వాక్యాలుగా రాస్తే అదే కవిత్వం అవుతుందని, కవిత్వం రాయడంలో మెళకువలు నేర్పించారు.

తొలి పుస్తకం కుమ్రుం సూరు

కవిత్వం రాయడంలో ఒడుపు తెలిసిన తర్వాత ఇక నేను వెనుదిరిగి చూడలేదు. నా తొలి పుస్తకం కుమ్రుం సూరు జీవిత చరిత్ర. ఆత్రం భీమ్‌రావు అనే మా కొలామ్ నాయకుడు సూరు జీవితాన్ని మౌఖికంగా చెప్పడంతో నేను అక్షరబద్ధం చేశాను. ఆ తర్వాత దండారి కైతికాలు అని దండారి నృత్యం గురించి రాశాను. మా కొలామ్‌ల ఆరాధ్యదైవం దంతన్‌పల్లి భీమయ్యక్ మహాత్మ్యం రాసిన తర్వాత మా నాన్న కోసం మోతీరామ్ శతకం రాశాను. మానవుడు ఎలాంటి వాడు అనేది కథాంశం. ఇవన్నీ తెలుగు లిపిలోనే రాశాను. ఎందుకంటే మా కొలామ్ భాషకు లిపి లేదు. కవిత్వం కూడా కొలామ్ భాషలోనే తెలుగు లిపితో రాశాను. కొన్ని కవితలు తెలుగులోనూ రాశాను.

అముద్రితం

ఉట్నూరుకు వచ్చిన తర్వాత నా అక్షరాల ఆకలి తీరిందని చెప్పాలి. అక్కడ 'ఉట్నూరు సాహితీ వేదిక'లో ప్రతి నెలా తొలి ఆదివారం కవి సమ్మేళనం జరిగేది. ప్రతి కవి సమ్మేళనంలోనూ నా కవిత ఉండాలని నిర్వాహకులు నన్ను బాగా ప్రోత్సహించారు. అలాగే రాశాను. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉంది. ఉద్యమం కోసం ఒక పుస్తకం రాశాను. అది ప్రచురణకు నోచుకునే లోపు తెలంగాణ రావడంతో అది చేతిరాత ప్రతిగానే ఉండిపోయింది.

ఆకాశవాణిలో కొలామీ కవిత్వం

కొలామీ భాషలో రాసిన కవిత్వం ఆకాశవాణిలో ప్రసారమైంది. అలాగే 2021లో విజయవాడలో జరిగిన గిరిజన సాహిత్య సదస్సులో పాల్గొని మా భాషలో కవిత చదివాను. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో 'దక్షిణ భారత కవుల కలయిక'లోనూ అవకాశం వచ్చింది. కొలామీలో కవిత, దానికి తెలుగు అనువాదం కూడా చేశాను. ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లో జరిగిన 'అఖిల భారత గోండ్వానా సాహిత్య సభలు'కు ఆహ్వానం వచ్చింది. కానీ పరీక్షల కారణంగా వెళ్లలేకపోయాను. ఈ సాహిత్య ప్రస్థానంలో నా ఆకాంక్ష ఒక్కటే... మా కొలామీ భాషను అంతరించి పోనివ్వకుండా కాపాడుకోవడం. ఇప్పటికే చాలా నష్టం జరిగింది. ఈ తరం చిన్న పిల్లలు చాలా పదాలను మర్చిపోయారు. తల, దేహం, ఉడుత, చిలుక వంటి పదాలను తెలుగులో చెప్తున్నారు తప్ప కొలామీలో చెప్పడం మర్చిపోయారు. అందుకే అలాంటివి కనుమరుగు కాకుండా అక్షరాల్లో, ఆడియోల్లోనూ రికార్డ్ చేయాలనేదే నా ఆకాంక్ష.

మౌఖిక సాహిత్యం అక్షరాల్లోకి...

మా కొలామీ భాష మధ్య ద్రావిడ భాష. దీనికి లిపి లేదు. కానీ విస్తృతమైన సాహిత్యం ఉంది. బాల సాహిత్యం, పొడుపు కథలు, భీమయ్యక్ పాటలు, దేవుడి పాటలు, పెళ్లి, ఇతర వేడుకల పాటలన్నీ మౌఖికంగా ఒక తరం నుంచి మరొక తరానికి ప్రసారం అవుతున్నాయి. ఇప్పుడు వస్తున్న మార్పులతో ఈ తరం పిల్లలు మా పాటలను మర్చిపోతే ఇక ఈ తరంలోనే మా సాహిత్యం కూడా అంతర్థానమైపోతుంది. అందుకే ఈ పని మొదలుపెట్టాను. ప్రతి పదాన్ని పొల్లుపోకుండా గ్రంథస్థం చేస్తాను.

– ఆత్రం మోతీరామ్

– వాకా మంజులారెడ్డి,

ఫొటోలు : ఆత్రం జగదీశ్, సాక్షి, ఇంద్రవెల్లి

ఆర్ట్ అండ్ కల్చర్

ముందైతే నీళ్లు తాగు నాయనా!

టర్కీ కార్టూనిస్ట్ మూస గుమ్‌స్ గీసిన ఈ కార్టూన్ చూసి చిన్న కథ చెప్పమంటే ఇలా చెప్పవచ్చు... దారిన పోయే దానయ్య దారి తప్పాడు. ఎటెటో వెళుతున్నాడు. ఎండకు విపరీతమైన దాహం వేస్తోంది. నిర్జన ప్రాంతంలో చుక్క నీరు కనిపించడం లేదు. దాహంతో కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. అప్పుడే ఏదో మెరుపు



మెరిసింది. చూస్తే....అల్లావుద్దీన్ అద్భుత దీపం! దాన్ని టచ్ చేయగానే 'ఏం కావాలో కోరుకో నాయనా. ఒకటే ఛాన్సు అని గుర్తుంచుకో' అన్నది జీన్నీ భూతం.'లెక్క లేనన్ని వజ్రవైఢూర్యాలు కావాలి. వాటిని తీసుకెళ్లడానికి గుర్రపుబండ్లు కావాలి' అని అడిగాడు. అతడు కోరుకున్నవి వచ్చాయి. వజ్రవైఢూర్యాలను తీసుకువెళుతున్నప్పుడు దానయ్యలో దాహం పెరిగిపోయింది. 'ఈ దాహంతో చనిపోయేలా ఉన్నాను. చచ్చిన తరువాత ఈ వజ్రవైఢూర్యాలను ఏం చేసుకుంటాను. జీన్నీని గుక్కెడు నీళ్లు అడిగే ఉంటే బతికి ఉండేవాడిని కదా' అనుకుంటున్న సమయంలో జీన్నీ ప్రత్యక్షమై 'ముందైతే నీళ్లు తాగు నాయనా!' అని దయతలిచింది. 'విచక్షణ' అనేదాని గురించి వివరించి చెప్పింది. ఇక మూస గుమ్‌స్ విషయానికి వస్తే... బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ చదువుకున్న మూస ఎన్నో పత్రికలలో పనిచేశాడు. పిల్లల పుస్తకాలకు బొమ్మలు వేశాడు. 'ఫన్నీ న్యూస్' అనే రేడియో ప్రోగ్రాం కోసం కలం పట్టాడు.

• టెక్... టాక్

రియల్ మీ నార్జో ఎన్53



డిస్‌ప్లే: 6.72 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 8-మెగా పిక్సెల్
ర్యామ్: 4జీబి 6జీబి స్టోరేజ్: 64 జీబి 128జీబి బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 2400×1080 పిక్సెల్స్ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్ కలర్స్: బ్లాక్ అండ్ గోల్డ్

గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' టూల్



గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' అనే టూల్‌ని తీసుకురానుంది. దీని ద్వారా ఒక ఇమేజ్ లేదా సిమిలర్ ఇమేజ్ గూగుల్‌లో మొదటిసారిగా ఎప్పుడు కనిపించిందో తెలుసుకోవచ్చు. ఇమేజ్ తాలూకు కంటెంట్, కాంటెక్స్‌లను బాగా అర్థం చేసుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ ఇన్‌ఫర్మేషన్ మరింతగా తెలుసుకోవచ్చు. ఒక ఇమేజ్‌కు సంబంధించిన విశ్వసనీయత (సహజమైన ఇమేజా? ఏఐ ఇమేజా?)పై స్పష్టత వస్తుంది.

ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్ హెడ్‌ఫోన్స్



ఫెయిర్‌ఫోన్ 'ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్' పేరుతో హెడ్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఇది మాడ్యూలర్ మరియు రిపేర్ ఫ్రెండ్లీ హెడ్‌ఫోన్. ఇయర్ కుషన్‌ను సులభంగా రీప్లేస్ చేసుకోవచ్చు. **బ్యాటరీ:** 800 ఎంఏహెచ్ (ఈజీ-టు-రీప్లేస్ బ్యాటరీ) • వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ • 40ఎంఎం డ్రైవర్స్ • **బ్లూటూత్:** 5.1

గెలాక్సీ వాచ్ 5 ప్రో



ట్రెక్కింగ్, మౌంటెన్ క్లైంబింగ్‌లాంటి ఔట్‌డోర్ యాక్టివిటీలకు సౌకర్యంగా ఉండేలా శాంసంగ్ గెలాక్సీ వాచ్‌ను డిజైన్ చేశారు.
డిస్‌ప్లే: 1.4 అంగుళాలు **కలర్స్:** బ్లాక్ అండ్ గ్రే • కోర్నింగ్ గోరిల్లా గ్లాస్ • బ్లూటూత్ కాలింగ్ **ఫీచర్:** చెకింగ్ నోటిఫికేషన్స్, సెట్టింగ్ టైమర్స్...మొదలైనవి. • డ్యూయల్-కోర్ ప్రాసెసర్ • 1.5జీబి ర్యామ్ ప్లస్ 16జీబి ఇంటర్నల్ స్టోరేజ్ **ధర:** • ₹44,999 (రెగ్యులర్ బ్లూటూత్ మోడల్) • ₹49,999 (ఎల్‌టీయి వేరియంట్)

కెనాన్ పవర్ షాట్



కెనాన్ 'పవర్ షాట్ వీ10' పేరుతో కొత్త వ్లోగింగ్ కెమెరాను లాంచ్ చేసింది. తేలికగా ఉండే ఈ కెమెరాను సులభంగా పాకెట్‌లో పెట్టుకోవచ్చు. క్రౌడ్ ప్లేసెస్‌లో కంఫర్టబుల్‌గా రికార్డ్ చేయడానికి వ్లాగర్స్‌కు ఉపయోగపడుతుంది. సింగిల్ హ్యాండ్‌తో దీన్ని ఆపరేట్ చేయవచ్చు. • 2.0 అంగుళాల ఎల్‌సీడీ టచ్‌స్క్రీన్ • హెచ్‌డీఎంఐ, యుఎస్బీ పోర్ట్ • **ధర:** ₹39,995